"ఏం కావాల్సార్?" సర్వరడిగేడు.

"ఏంవుంది వేడిగా?"

"అన్నీ వేడిగానే ఉన్నాయ్ సార్. డ్లీ, వడా, దోశా, కాదోశా, ప్మా, పెస్రట్, మిన్పట్, ఊతప్పా, బజ్జీ, బోండా, బిర్యానీ——" అరగుక్కలో లిష్టంత వొప్పగించేసి, "చెప్పాల్సరేం కావాలో—" అన్నాడు మిగతా గుక్కతో.

నేను ఉక్కిరి బిక్కిరై, గుక్క తిరక్క, ఒక గుటక వేసేను-ఇడ్లీ, వడ...తర్వాతేం చెప్పాడో తెలీక.

"ఏరా విశ్శిగా! చెప్పేం తిందాం?" అన్నాను. సమాధానం రాలేదు. పక్కకి చూసేను. విశ్శినాధం లేడు

ఆటూ యిటూ వెతకగా—అల్లంత దూరంలో - వాష్‌బేసిన్ పక్క నిలువుటద్దంలో వెఱ్ఱిగా చూసేసుకుంటున్నాడు తనని తాను ఎగాదిగా.

హోటల్లో చాలామంది వాణ్ణే చూ(సే)స్తున్నారు ఎగాదిగా.

"రేయ్?" అని పిల్చేను గట్టిగా, కాస్త కోపంగానూ.

వినపళే.దో, వినిపించుకోలేదో-విశ్శినాధం చూశ్శేదు.

విసురుగా వెళ్ళి, "వెఱ్ఱా, పిచ్చా?-రా-రా-" అన్చెప్పి తీసుకొచ్చేను.

"ఏరా రాజూ! నేను నిజంగానే యింత సన్నంగా ఉంటానా, లేక, ఈ అద్దం మంచిది కాదా?" అనడిగేడు విశ్శినాధం కూర్చుంటూ.

"ఛచ్ఛా, అది పావలా-కానీ అద్దం, నువ్వేమీ అంత సన్నం కాదు" అన్నాను.

"నిజంగానే?"

"ఆఁ."

"నా మీదొట్టే?"

"ఊఁ."

వెళ్ళిపోయిన సర్వర్ మళ్ళీ ఒచ్చేడు-ఏం కావాలంటూ.

నేను విశ్శినాధం కేసి చూసేను.

"ఇడ్లీ తిందాం" అన్నాడు

"సరేనని, సర్వర్‌కి ఆర్డరిచ్చేను.

"వెఱ్ఱిపీనుగా. మినువుఁలు ఒంటికి బలం తెల్సా?" అన్నాడు విశ్శినాధం-సర్వర్ వెళ్లేక.

* * *

భోంచేసి, సిగరెట్టు కాల్చుకుంటున్నాను.

# బెంగ

## ఎల్బీశ్రీరామ్

కరంటు లేదు.

విశ్వనాధం బైటికెళ్లేడు.

ఏం తోచడం లేదు

"ఏ దివిలో విసిరిన పా-రిజా..తమో.."

కాకి కావ్ కావ్ మన్నట్టు పాడేను

పాటాప్పేపి, సిగరెట్టు దమ్ము లాగుతుంటే చెప్పుల చప్పుడైంది.

"ఎవరు, విశ్వనాధం?"

"ఊఁ."

విశ్వనాధం లోపలికొచ్చేడు.

కరంటొచ్చింది.

"సరిగ్గా మవ్వొచ్చేవ్, కరంటూ ఒచ్చింది" అనబోఁయి, వాడిచేతిలో పొట్లం చూసి-

"పకోడీ త్తెచ్చే వేవి(ట్రా? ఎంత ప్రేమురా నేనంటే నీకూ!" అన్నాను ఆశగా.

"పకోడీలూ కాదు, పెసరపుణుకులూ కాదు-నోరూరించుకోకు, శెనగలివి."

"శనగలా? ఎందుకురా? శనగలెందుకూ?"

"నానబెట్టి తినడానికి."

"?"

"అలా చూస్తావేట్రా? శనగలు నానేసుకుని, రోఝూ ప్రొద్దున్నే తింటే ఎంత బలవోఁ తెల్సా? సర్లే, నీకేం తెల్సులే." అని, శనగల పొట్లం విప్పి, చారెడు శనగలు స్టీలు గిన్నెలో వేసి, నీళ్లు పోసి నానేసి, గిన్నెమీద మూత పెట్టొచ్చేడు.

ఆ మర్నాడు పొద్దున్న లేచి చూసేసరికి-విశ్వనాధం ఒబ్బిడిగా కూచుని, ఒళ్లో శనగల గిన్ని పెట్టుకుని-చెట్టుమీద కోతి పండు తింటున్నట్టు తింటున్నాడు శనగలు.

* * *

పచ్చగా-పొడుగ్గా-సన్నంగా ఉంటాడు విశ్వనాధం. పచ్చగా, పొడుగ్గా, సన్నంగా ఉంటే అందంగా ఉంటారు కొందరు. విశ్వనాధం అందంగా ఉంటాడు. కాని పైన చెప్పిన మూడు"గా"ల్లోనూ మూడోగా ఉండడం విశ్వనాధాని కిష్టంగా ఉండదు. లావుగా ఉండాలని వాడి కోరిక. ఆ కోరిక తీరకపోడం చేత-తీరిక దొరికినప్పుడల్లా వెక్కి వెక్కి వెట్టి రాగాలు పెట్టేస్తూంటాడు.

'నేనెంత సన్నంగా ఉంటానో!'-

'ఇహ యింతేనా?'-

'లావెక్కనా?'-అని.

లావెక్కాలని విశ్వనాధానికి కోరికే కాదు. కోరికా, బాధా, సమస్యాను. వెరపి బెంగానున్ను.

'విశ్వనాధం అస్థిపంజరం'-

'విశ్వనాధం రవణారెడ్డి'-

'విశ్వనాధం గెడకర్ర'-

'విశ్వనాధం ఎలక్ట్రిక్ పోల్'-

'విశ్వనాధం కొంగ'-

ఇలా యిలా ప్రజలు అనేసుకుంటున్నారేమో అనుకుని, "అనేసుకుంటున్నా" రని-విశ్వనాధం మనసు ఎలక రూపంలో ఒచ్చి అతన్ని దొలిచేస్తుంది.

ఒక్కోసారి అర్ధరాత్రి ఏపన్నెండు గంటలప్పుడో లేచి, లైటేసి, అద్దంలో వివిధ కోణాల్లో చూసుకుని ఏకాంతంగా బాధపడిపోతూంటాడు.

పాపం ఉట్టుట్టిగా బాధపడేసి ఊరుకోడు. లావెక్కడానికి ఎప్పుడూ ఏదో ఒక హడావిడిలాంటి ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. 'బ్రహ్మర్షి' అనిపించుకోడానికి విశ్వా

మిత్రుడికి ఎంత పట్టుదలుందో 'లావెక్కేను' అనిపించుకోడానికి విశ్వనాధానికి అంత పట్టుదలా ఉంది.


కొన్నాళ్ళపాటు అరటిపళ్ళు తిన్నాడు.

ఎవరో గోధుమరొట్లు తినమని సలహా యిచ్చేరు. తిన్నాడు.

పచ్చి శనగలు తిన్నూచేడు-పట్టరుగుతుం దన్నారు. తిన్నాడు.

పళ్లు తినమన్నారు.

పచ్చిలు తినమన్నారు.




మందులు తాగమన్నారు.

తేనె నాకమన్నారు.

ఏడొ మన్నారు.

నవ్వమన్నారు.

ఇంకా చాలా-మన్నారు.

వీడు అన్నీ ఓపిగ్గా చేసేడు.

బొతే - ఎంత చేసినా, ఎన్ని తిన్నా-ఒక్కటీ అక్కరకు రాకుండా పోయేయి-శరీరం సన్నంగానే ఉంది.

'లావెక్కాలని ఉంది' అనే కోరిక అలానే ఉంది.

ఒక అంగుళం లావెక్కినట్టు ఎప్పుడేనా వాడికి అనుమానం వస్తే-"నేనీ మధ్య కాస్త లావెక్కేను కదట్రా?" అనడుగుతూంటాడు-గుండెల మీద చేత్తో తడువుకుంటూనో, చేయి మడిచి కండ చూసుకుంటూనో.

"అవున్రా ఈ మధ్య కాస్త బాగానే ఉన్నావ్" అంటే చాలు బుడగలా ఉబ్బిపోతాడు. కాని అదేం జాతకవో వాడిది. ఆ లావు ఆట్టేకాలం నిలబడదు

హటాత్తుగా మంచం ఎక్కేసి—నాలుగో, పదో లంఖణాలు వేసేసి—పరిస్థితులు ఉల్టాసీదా అయి-తలప్రాణం తోకకొచ్చి-తోకప్రాణం లేచి మళ్ళీ తలకొచ్చి-చావు తప్పి, కన్ను లొట్టపోయి-పాత కిలోన్నర పెర్సనాల్టీనీ కొత్తగా ఒచ్చిన పది గ్రాముల పెర్సనాల్టీనీ కలిపి రోగం ఎత్తుకుపోగా-ఒర్రి మనిషి మిగుల్తాడు.

మళ్లీ బెంగ

అద్దం ఒద్దల్లు.

అసలు వాడు అద్దాన్ని చేత్తో మోసి మోసి సగం చిక్కుంటాడని నా అనుమానం

"పోనీ దాన్ని మెడకు కట్టేసుకోరా-ముష్టాడి మెళ్ళో బిళ్ళలా ఉంటుంది చక్కగా" అంటే బుస్సు మంటాడు.

"ఏదో ఏడుస్తాలే నువ్వేమీ ఎకసెక్కాలు

చెయ్యక్కర్లేదు'' అంటాడు. అప్పు డప్పుడు ''ఈ మధ్య నా బుగ్గలు కొంచెం ఉబ్బేయి కదరా?'' అంటాడు-పళ్లు కనబడ కుండా, పెదాల్ని జలగల్లా సాచి, చప్పి దవళ్ళుచూపిస్తూ.

''ఏరా విశ్వనాథం! ఇది నీ ఖర్మా, నా ఖర్మా?'' అని చాలాసార్లు అడగబోయి మానేసేను మా స్నేహం విడిపోడం యిష్టంలేక.

* * *

కళ్లు తెరిచి కిటికీలోంచి బైటికి చూసేను. ఇప్పుడిప్పుడే తెల్లవారుతోంది. ఇళ్లూ, చెట్లూ, అన్నీ పూర్తిగా మంచులో మునిగిపోయి ఉన్నాయి. రగ్గూ, దుప్పటీ జోడించి కప్పుకున్నాను. ఐనా చలి ఒంటిని కొరికేస్తోంది. ఇంకో దుప్పటి తలకిం దుంది. అది కూడా తీసి కప్పుకుంటే బావుణ్ణు. మనసు గారం గుడిపింది-

''పడుక్కుందూ-కదిల్తే నాకు చలే స్తుందీ!'' అని.

చిన్నగా చప్పుడు వినిపించి పక్కకి చూసేను.

పూనకం పూనిన వాడిలా-గుంజీలు తీసే స్తున్నాడు విశ్వనాథం.

ఒంటిమీద డ్రాయరు తప్ప బట్టల్లేవు.

గుంజీలు తీస్తుంటే టెర్లిన్ చొక్కా లాంటి వాడి పల్చటి చర్మంలోంచి యము కలు లెక్కపెట్టొచ్చన్నట్టు కనిపిస్తున్నాయి.

పట్టుమని పాతిగ్గుంజీలు తీసేసి, దబ్బు మని చాపమీద నిటారుగా పడిపోయి-ఒగ ర్చేస్తున్నాడు.

అనక-ఆయాసం తగ్గేక, లేచి కూచు న్నాడు.

ఓ కోడిగుడ్డు బద్దలుకొట్టి - గడగడా తాగేసేడు.

అద్దంలో అటూ యిటూ చూసుకుంటు న్నాడు-ఆవేశంగా, ఆనందంగా, బాధగా, బెంగగా.

వెఱ్ఱి పీనుగ.

పాపం కుర్ర పీనుగ.

కష్టపడి పోతున్నాడు.

ప్చ్.

'ప్చ్' అనుకుంటూనే-చలికి తట్టుకో లేక, తలకింద దుప్పటి తీసి పైన జోడించు కుంటూనే-విశ్వనాథంతో అన్నాను-''రేయ్ విశ్వనాథం! ఎందుకురా ఈ చలిలో అలా కిటికీ తలుపులు తెరిచేసి, చొక్కా విప్పేసి, గుంజీలూ, దండీలూ తీసేసి, అద్దంలో చూసేసుకుని, బెంగపడిపోయి, ఆవేశ పడి పోయి ..ఎందుకురా అంత కష్టపడ్తావ్? లావు గురించి నీకెందుకురా యింత తాప త్రయం? ఇప్పుడు నీకేం తక్కువైందిరా?''


విశ్వనాథం ఇమ్మీడియెట్‌గా ఇన్‌సల్టయి పోయి, కోప్పడిపోయి అద్దంలో చూసు కుంటూనే ఆవేశంగా అన్నాడు-''నవ్విన నాపచేనే పండుతుందిరా. నెల్లాళ్ళ టైమియ్ నాకు. సరిగ్గా మళ్ళా నెల ఈ తారీఖ్కి చూడు నన్ను. గుండెలు బాదుకుని ఆశ్చర్యపోతావ్ నా పెర్సనాలిటీ చూసి. వీధుల్లో నేన్నడు స్తుంటే రోడ్డు అదుర్తుంది ఆఁ''

''ఐ బాబోబో యై బాబోయ్! ఎలాగరా విశ్వనాథం ఆ ఘోరం చూడ్డం?''

''ఏమో ఎలా చూస్తావో-అది మాత్రం ఖాయం.''

''నే తర్వాచ్చూస్తా గానీ-ముందా కిటికీ తలుపులు మూసెయ్-నాకు చలేస్తోంది.''

* * *




నేల్లాళ్ళు పోయేక చూసేను.

విశ్వనాథం లావెక్కలేదు.

విశ్వనాథం నడుస్తుంటే రోడు అదర లేదు.

విశ్వనాథం బెదరలేదు

మానవ ప్రయత్నం మానలేదు.

బెంగని ఒదల్లేదు.

పట్టువదలని విక్రమార్కుడు

*          *          *

ఆ రోజు-నాకు కడప ట్రాన్స్‌ఫరైన ోజు. చాలా బాధేసింది విశ్వనాథాన్నీ, ాగ్యనగరాన్నీ వొదిలి వెళ్ళడానికి.

విశ్వనాథం బస్టాండు కొచ్చేడు నాకు ాటా చెప్పడానికి.

కాసేపు మా పాత ముచ్చట్లు మాట్లాడుకున్నాం.

ఇద్దరం చెరో లీటరు కన్నీళ్ళతోటే గుండెల్ని తడుపుకున్నాం.

తర్వాత విశ్వనాథం అక్కడున్న వెయింగ్‌మిషన్ మీద బరువు తూచుకున్నాడు.

అరకేజీ బరువు తగ్గేనని బాధపడ్డాడు.

జీవితం చాలా విలువైనదనీ-దాన్ని అందంగా అనుభవించమనీ-అంతే కానీ 'లావెక్కడం', 'సన్నబడ్డం' లాంటి చిన్న చిన్న విషయాల గురించి పదే పదే ఆలోచించి-బుర్ర చెడగొట్టుకుని - బాధపడి - మరేమో . బెంగపడి - చిక్కి - శల్యమై-

అమూల్యమైన కాలాన్ని వృధా చేసుకోవద్దనీ, సన్నంగా ఉండడంలో ఉండే అందవూ, లాభాలూ, సుఖాలూ ఎరగమనీ-అవనీ, ఇవనీ-అలాగనీ-ఇలాగనీ-నేవేవో నాకు తోచిన ఉచిత సలహాలు కొన్ని చెప్పి, 'ఉత్తరాలు రాస్తూండు-మర్చిపోకు' అనీ చెప్పి, బస్సెక్కేసేను.

బస్సు కదిలేక అనుకున్నాను-చాలా అనవసరంగా చెప్పేనేమో, వాడు చిన్న బుచ్చుకున్నాడేమో అని.

(ఆ తర్వాత మళ్ళీ విశ్వనాథాన్ని చూడ్డం కుదర్లేదు నాకు. వాడి పెళ్ళికి కూడా వెళ్ళలేక పోయేను.)

* * *

నాలుగేళ్ళ తర్వాత-చిన్న పని తగిలి హైద్రాబాదు వెళ్లేను బస్సు దిగి విశ్వనాథం కోసం వెదుకుతున్నాను,

"టెలిగ్రాం అందలేదా ఏవిటి? వీడు రానేలేదు" అనుకుంటుండగా

"వారేయ్, ఒరేయ్, రాజూ! హారి! మారిపోయేవురోయ్" అంటూ ఆయాసంగా నా దగ్గరికి పరిగెత్తు కొచ్చేడు విశ్వనాథం.

ఆశ్చర్య పోయేను.

అప్పుడంత సన్నంగా ఉండే విశ్వనాథం ఏనుగులా తయారయ్యేడు.

చిన్నగుమ్మిడికాయంత తలా.

బంగినపల్లి మావిడిపండు చెంపల్లా-ఉబ్బిన బుగ్గలూ.

లావుపాటి జబ్బలూ.

మెడకీ, గడ్డానికీ మధ్య వేలాడుతున్న కండా,

చిరుబొజ్జా

గుర్తు తెలియనంతగా మారిపోయేడు.

"ఔరా! ఔరా! విశ్వనాథం, నువ్వేరా యీ మనిషివి?"

"ఔ(ను)రా ఏవిఁటలా ఆశ్చర్య పోతావ్? పద పోదాం."

నాకు చాలా ఆనందం వేసింది. జీవితంలో వాడి తాలూకు పెద్ద కోరిక తీరినందుకు.

మాటల మధ్యలో అడిగేను-"ఎలా అయ్యేవురా నువ్వింత లావు?" అని.

"ఏమోరా, ఈ మధ్య యిలా ఊరిపోయేను నీళ్ళలో శవంలాగ" భళ్ళుమని నవ్వేడు-బాల్చీ జారి నూతిలో పడ్డట్టు.

రాత్రి నేను, విశ్వనాథం ఏదో హరికథ చెప్పుకుంటూండగా - విశ్వనాథం పెళ్ళాం భోజనానికి లేవమంది నన్ను.

లేచేను.

విశ్వనాథం లేవలేదు.

"ఏరా లేవవేం?" అన్నాను.

విశ్వనాథం మొహమాటం మార్కు-మొహంతో నవ్వేడు.

విశ్వనాథం పెళ్ళాం కిసకిసా నవ్వుతూ చెప్పింది-"ఆయనకీమధ్య బెంగ (బెంగ) పట్టుకుంది లెండి-బాగా లావై పోతున్నారని. అందుకని ఈ మధ్య ఒక పూటే భోజనం చేస్తున్నారు."

★